RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

**చెరువులపై దృష్టిసారిస్తాం మంత్రి కొండా సురేఖా**

2



| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 110 | మే 13 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 110 | May 13 Wednesay 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |



## ఇరు రాష్ట్రాల కీలక నిర్ణయం

**తెలుగు రాష్ట్రాల తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాల కేటాయింపుపై చర్చ**




**హైదరాబాద్ జనసంఘర్షణ**

హైదరాబాద్‌లో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశంలో తెలుగు రాష్ట్రాల తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాల కేటాయింపుపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు, ఉన్నతాధికారులు పాల్గొని నీటి వినియోగంపై చర్చించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుండి ఆగస్టు 15 వరకు ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీల నీటిని వాడుకునేందుకు బోర్డు అనుమతి నిచ్చింది. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్రానికి సాగర్ నుండి 16 టీఎంసీలు, శ్రీశైలం ప్రాజెక్టు నుండి మరో 6 టీఎంసీల నీటిని వినియోగించుకోవడానికి అంగీకారం

➤ మిగతా 2వ పేజీలో..

## నీట్ రద్దు




**సీబీఐ విచారణకు ఆదేశం**

**ఇప్పటివరకు 13 మందిని అరెస్ట్**

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంతో జాతీయ పరీక్షల సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. మే 3న నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తూ, ఈ ఉదంతంపై సీబీఐ విచారణకు ఆదేశించింది. రాజస్థాన్‌లోని సికార్ కేంద్రంగా ప్రశ్నపత్రం లీకైనట్లు వస్తున్న ఆరోపణలు నిజమని ప్రాథమిక విచారణలో తేలడంతో, పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని కాపాడేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను ప్రకటించి అడ్మిట్ కార్డులు జారీ చేస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. లీకేజీకి సంబంధించి రాజస్థాన్ పోలీసులు జరిపిన దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. కేరళకు చెందిన ఓ ఎంబీబీఎస్ విద్యార్థి ద్వారా ఈ పేపర్ బయటకు వచ్చినట్లు గుర్తించారు. 'గెస్ పేపర్' పేరుతో వాట్సాప్‌లో

➤ మిగతా 2వ పేజీలో..

## బంగాళాఖాతంలో అల్పపీడనం



**విశాఖపట్నం జనసంఘర్షణ**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రస్తుతం నిలకడగా కొనసాగుతోందని, రాబోయే 48 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో రానున్న

➤ మిగతా 2వ పేజీలో..

## కొనుగోళ్లలో జాప్యం సహించం

**కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్**



**హైదరాబాద్ జనసంఘర్షణ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న సేకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కీలక ఆదేశాలు జారీ చేశారు. పంట కొనుగోళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని, రైతులు ఇబ్బంది పడకుండా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ధాన్యం రవాణాలో ఒప్పందాల మేరకు లారీలను ఏర్పాటు చేయని కాంట్రాక్టర్లపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అవసరమైన చోట పోలీసుల సహకారం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం నిల్వకు గోడౌన్ల కొరత ఉంటే ప్రత్యామ్నాయంగా ఫంక్షన్ హాళ్లు, రైతు బజార్లను వినియోగించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూడటంతో పాటు, రవాణా ఆలస్యం కాకుండా ట్రాక్టర్లను కూడా వాడుకోవాలని

➤ మిగతా 2వ పేజీలో..

## జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత

**గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభించనున్నట్లు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ పథకానికి సంబంధించిన పూర్తి విధివిధానాలను ఈ నెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా

➤ మిగతా 2వ పేజీలో..

## ఇంధన నిల్వలపై ఆందోళన అవసరం లేదు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

దేశంలో ఇంధన నిల్వలకు సంబంధించి ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, క్రూడాయిల్ సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మన వద్ద 69 రోజులకు సరిపడా ముడి చమురు, ఎల్ఎన్‌జీ నిల్వలు ఉండగా, 45 రోజులకు సరిపడా ఎల్‌పీజీ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, దేశీయ అవసరాల దృష్ట్యా ఎల్‌పీజీ ఉత్పత్తిని రోజుకు 54,000 టన్నులకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. ఇంధన సరఫరా గొలుసు పటిష్టంగా ఉందని, ఎక్కడా కొరత ఏర్పడే అవకాశం లేదని

➤ మిగతా 2వ పేజీలో..

# నీట్ రద్దు

**మొదటిపేజీ తరువాయి..** చలామణి అయిన ఈ మెటీరియల్‌లోని దాదాపు 140 ప్రశ్నలు అసలు ప్రశ్నపత్రంతో 100 శాతం సరిపోలడం గమనార్హం. పరీక్షకు దాదాపు 42 గంటల ముందే ఈ పేపర్ కోచింగ్ సెంటర్లు, కౌన్సిలర్ల ద్వారా విద్యార్థులకు చేరింది. ఒక్కో పేపర్‌ను రూ. 20 వేల నుండి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్ట్ చేయగా, నిందితుల నెట్‌వర్క్‌పై లోతైన విచారణ కొనసాగుతోంది.

# ఇరు రాష్ట్రాల కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి..** తెలిపింది. సమావేశం సందర్భంగా తెలంగాణ అధికారులు ఒక కీలక అంశాన్ని బోర్డు దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పటికే తన వాటా కంటే ఎక్కువ నీటిని వినియోగించుకుందని వారు ఫిర్యాదు చేశారు. అయితే, ప్రస్తుత వేసవి అవసరాలను మరియు తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని, ఇరు రాష్ట్రాల అభ్యర్థనల మేరకు ఈ నీటి కేటాయింపులు జరిగాయి. రాబోయే వర్షాకాలం వరకు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఈ జలాలను పొదుపుగా వాడుకోవాలని బోర్డు సూచించింది.

# కొనుగోళ్లలో జాప్యం సహించం

**మొదటిపేజీ తరువాయి..** సీఎం సూచించారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు రశీదులు అందజేయాలని, అకాల వర్షాల వల్ల పంట నష్టపోకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. వాతావరణ హెచ్చరికల పట్ల రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని, ప్రతి ఐకేపీ సెంటర్ మరియు రైస్ మిల్లు వద్ద పర్యవేక్షణకు బాధ్యులను కేటాయించాలని ఆదేశించారు. ఈ మొత్తం ప్రక్రియలో కలెక్టర్లే పూర్తి బాధ్యత వహించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొని కొనుగోలు పురోగతిని చర్చించారు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత

**మొదటిపేజీ తరువాయి..** సమావేశంలో స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి ఆయన అధికారులకు కీలక దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, ముఖ్యంగా నగర ప్రాంతాల్లో నివసించే వారికి వారి జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా 5 నుండి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లను కేటాయించాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్ నగర పరిధిలో సొంత స్థలాలు ఉండి, ఇల్లు లేని అర్హులైన లబ్ధిదారులకు ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను సూచించారు. నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ భూములు, మురికివాడలు, శిథిలావస్థలో ఉన్న పాత కాలనీలను గుర్తించి నూతన గృహ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే పూర్తయిన ఇళ్లలో మౌలిక సదుపాయాలైన విద్యుత్, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించిన మంత్రి, నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసిన అధికారులపై చర్యలకు ఆదేశించారు. అలాగే సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని, రెవెన్యూ మరియు అటవీ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలను సమన్వయంతో పరిష్కరించుకోవాలని అధికారులకు సూచించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

**మొదటిపేజీ తరువాయి..** ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం రాయలసీమ నుండి తమిళనాడు, కర్ణాటక వరకు ద్రోణి విస్తరించి ఉండటం వల్ల వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం సముద్ర మట్టానికి సుమారు 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకు వ్యాపించి ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. మరోవైపు, అండమాన్ సముద్రం మరియు దక్షిణ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ వారం చివరి నాటికి నైరుతి రుతుపవనాల రాకకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అల్పపీడన ప్రాంతం మినహా మిగిలిన బంగాళాఖాతం, అండమాన్ తీర ప్రాంతాల్లో ప్రస్తుతానికి వాతావరణం సాధారణంగానే ఉంటుందని సమాచారం. రుతుపవనాల ప్రవేశానికి మార్గం సుగమం అవుతున్న నేపథ్యంలో అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# ఇంధన నిల్వలపై ఆందోళన అవసరం లేదు

**మొదటిపేజీ తరువాయి..** మంత్రి భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ పరిణామాల వల్ల కలిగే ఆర్థిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించేందుకు మెట్రో రైళ్లు, కార్‌పూలింగ్ మరియు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. విదేశీ మారక ద్రవ్య నిల్వలను పొదుపు చేసేందుకు విదేశీ ప్రయాణాలు, బంగారం కొనుగోళ్లను వీలైనంత వరకు వాయిదా వేసుకోవాలని, వర్క్ ఫ్రమ్ హోమ్ వంటి విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని సూచించిన అంశాలను మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రజలు ఇంధన పొదుపు దిశగా అడుగులు వేయాలని కేంద్రం కోరుతోంది.

## చట్టానికి నా కొడుకు అతీతుడేమీ కాదు

**కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ**

**కరీంనగర్, మే12 :** తన కుమారుడు బండి భగీరథ్‌ను నేరస్థుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆవేదన చెందారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో సంజయ్ స్పందించారు. ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. నా కుమారుడిపై దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది.. డిప్రెషన్‌లోకి పోతోంది. నేను బాధపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారు. నేనెప్పుడూ బాధపడను. కుట్రలు, కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టను అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. చట్టం అందరికీ ఒక్కటేనని, తన కొడుకైనా మరెవరైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

## భగీరథ్ కేసులో నా వ్యాఖ్యలు వక్రీకరించారు

**బాధితురాలికి కూడా న్యాయం జరగాలని కోరా**

**మరోమారు వివరణ ఇచ్చిన మంత్రి పొన్నం**

**హైదరాబాద్, మే12 :**
కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని మాత్రమే తాను మాట్లాడానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేసే అంశంపైనే తాను మాట్లాడానని.. తన మాటలను కొంతమంది వక్రీకరించారని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం మాట్లాడారు. ఈ కేసులో భగీరథ్ విచారణ ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని తాను అన్నానని ప్రస్తావించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మున్నూరు కాపు సంఘాలు ఆరోపణలు చేశాయని అన్నారు. ఈ కేసులో బాధితురాలు కూడా అదే సామాజిక వర్గమని తాను చెప్పానని ప్రస్తావించారు. తన ఉద్దేశంలో కూడా బాధితురాలికి న్యాయం జరగాలనే తపన మాత్రమే ఉందని అన్నారు. ఇందులో ఎక్కడ కూడా కాంప్రమైజ్ కావాలని తాను మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. బాధితురాలికి కాంగ్రెస్ అండగా ఉంటుందని.. వారికి పూర్తిగా మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తాను పోరాడతానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## భగీరథకు సిట్ నోటీసులు

**నేడు విచారణకు రావాలని ఆదేశం**

**హైదరాబాద్, మే12 :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ ధికారులు ఆదేశించారు. సిట్ అధికారులు బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌ను విచారించనున్నారు. ఈ కేసుకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధితురాలి స్టేట్‌మెంట్ నమోదు చేసిన అనంతరం పోలీసులు ఈ కేసులోని సెక్షన్లను మార్చారు. గతంలో నమోదు చేసిన పోక్సో యాక్ట్ సెక్షన్లను సవరించారు.

## ఎపిలో స్థానిక ఎన్నికల నిర్వహణ

**అధికారులతో సమీక్షించిన ఎన్నికల కమిషనర్**

**అమరావతి, మే12** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంగళవారం కీలక సమావేశం నిర్వహించింది. స్టేట్ ఎలక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికల సన్నాహకాలు, ప్రీ-ఎలక్షన్ కార్యకలాపాల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్, మున్సిపల్, బీసీ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. గ్రామ పంచాయతీలు, అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులు వివరాలు సమర్పించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుగా చేపట్టాల్సిన కార్యక్రమాల పురోగతిని ఎస్ఈసీ సమీక్షించారు. ఓటరు జాబితాల సవరణ, రిజర్వేషన్ల ఖరారు, వార్డుల విభజన, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు వంటి అంశాలపై చర్చించారు. ఎన్నికల నిర్వహణను పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు.

## నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

**వారి సేవలు చిరస్మరణీయం**

**వారిది ఉదయోగం కాదు...నిరంతర సేవ**

**1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు**

**నియామక పత్రాలు అందచేత**

**వారి సేవలు నిరుపమానమని అన్న మంత్రి దామోదర**

**హైదరాబాద్, మే12 :**
ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేశారు. కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మీర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీపీహెచ్ రవింద్ర నాయక్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నర్సులను ఉద్దేశించి ప్రసంగించారు.
అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నర్సులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు.
అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈరోజు మీకు జీవితాంతం గుర్తిండిపోతుంది.నర్సింగ్ అనేది కేవలం ఒక వృత్తి కాదు.. మానవత్వానికి చేసే గొప్ప అవకాశం. రోగులకు చికిత్స అందించడమే కాదు.. వారికి ధైర్యం, భరోసా, ఆశను కల్పించేది నర్సులే. ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి.పరిశుభ్రత, క్రమశిక్షణ, శాస్త్రీయ వైద్య సేవల ప్రాముఖ్యతను
ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు ఆమె.మీరు అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి. కోవిడ్‌లో కుటుంబ సభ్యులు కూడా పేషెంట్ల దగ్గర ఉండలేని పరిస్థితి, అటువంటి భయంకర మైన పరిస్థితుల్లో కూడా నర్సులు సేవలు అందించారు. తెలంగాణ ప్రజలు ఆ సేవలను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. గతంలో ప్రభుత్వ హాస్పిటళ్లలో భారీగా ఖాళీలు ఉండటం వల్ల వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి ఉండేది. ఈ సమస్యను మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని భారీ స్థాయిలో నియామకాలు చేపట్టింది. గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేశాం. ఇదే గ్రౌండ్‌లో ఇప్పటికే 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలు అందజేశాం. ఇక్కడే 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు నియామక పత్రాలు అందించాం. ఇక్కడే 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు నియామక పత్రాలు అందించాం. ఈరోజు ఇక్కడే 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందిస్తున్నాం అని మంత్రి వివరించారు. గతంలో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేశాం. రెండున్నర సంవత్సరాల్లో 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుంది. దాదాపు మరో 5 వేల పోస్టుల భర్తీ పక్రియ కొనసాగుతోంది. ఇందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలు మరో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తాం.న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తాం అని మంత్రి దామోదర వెల్లడించారు.

## చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ

**ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం**

**అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష**

**హైదరాబాద్, మే12 :** తెలంగాణ రాష్ట్రంలో చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల సమీక్షా సమావేశం మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్స్ అథారిటీ కార్యకలాపాలు, వెట్‌ల్యాండ్స్ కాలుష్య నియంత్రణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు. ఈ సమావేశానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల పునరుద్ధరణ, అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. వెట్‌ల్యాండ్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అక్రమ నిర్మాణాలు, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పక్షులు, జలచరాలు, పర్యావరణ సమతుల్యతకు

# ఆర్మూర్, మోర్తాడ్‌లో అక్రమ ఇసుక రవాణాపై చీత ఫోర్స్ మెరుపు దాడులు

- రెండు భారీ లారీలు పట్టివేత పోలీస్ కమీషనర్ వెల్లడి.

బోధన్ మే 12 జన సంఘర్షణ

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, మైనింగ్ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా సి.సి.ఎస్ ఏసీపీ ఇన్‌చార్జ్ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీత ఫోర్స్ సిబ్బంది నిత్యం ప్రత్యేక నిఘా నిర్వహిస్తూ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. నేడు మోర్తాడ్ పోలీస్ స్టేషన్ పరిధి, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చీత ఫోర్స్ బృందం విస్తృత తనిఖీలు నిర్వహించింది. రహస్య సమాచారం మేరకు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇసుక లారీలను గుర్తించిన పోలీసులు వెంటనే వాటిని అడ్డుకుని తనిఖీ చేశారు. తనిఖీల్లో రెండు 14 టైర్ల భారీ వాహనాల్లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, రవాణా పత్రాలు లేదా మైనింగ్ సంబంధిత డాక్యుమెంట్లు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే వాహనాలను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లు మరియు సంబంధిత వ్యక్తుల వివరాలను నమోదు చేశారు. పట్టుబడిన లారీలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సంబంధిత మోర్తాడ్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు అప్పగించారు. కేసు నమోదు చేసి, ఇసుక ఎక్కడి నుండి తరలిస్తున్నారు , దీనికి సంబంధించి మరెవరు ఉన్నారు అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం వాటిల్లడమే కాకుండా, నదీ పరివాహక ప్రాంతాలు దెబ్బతిని పర్యావరణ సమతుల్యతకు ముప్పు ఏర్పడుతోందని అధికారులు తెలిపారు. అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరగడం వల్ల భూగర్భ జలాల స్థాయి తగ్గిపోవడం , వ్యవసాయ భూములపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు





మాట్లాడుతూ..జిల్లాలో అక్రమ మైనింగ్ మరియు ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి వేళల్లో కూడా ప్రత్యేక బృందాలతో చెక్‌పోస్టులు , ప్రధాన రహదారులు మరియు గ్రామీణ మార్గాల్లో తనిఖీలు మరింత ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# వికలాంగుల సమస్యలపై మే నెలలో సర్వే చేయాలి

బోధన్ మే 12 జన సంఘర్షణ




ఎడపల్లి మండల కేంద్రంలో. వికలాంగుల కుల జాతీయ వేదిక నిజాంబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మే నెల 1వ తేదీ నుంచి మే నెల15 వరకు గ్రామాలలో సర్వేలు చేయాలని పిలుపుమేరకు వికలాంగుల సమస్యలు తెలుసుకోవలి. ఈ సందర్భంగా నిజాంబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల గంగాధర్ మాట్లాడుతూ... వికలాంగుల అందరితో మాట్లాడుతుంటే అనేకమంది అనేక రకాల సమస్యలు చెప్పారు. ఇప్పటికీ కొత్తగా దరఖాస్తులు పెట్టిన వారికి పెన్షన్లు రావడం లేదు ఇస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం 4016 వేల రూ.నుండి 6016 వేల రూ.ఇస్తామని ఇప్పటికీ ఇవ్వడం లేదు. సదరం సర్టిఫికెట్లు కొంతమందికి ఇప్పటికి రావడం లేదు. అనేక సందర్భాల్లో దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ దరఖాస్తులు తీసుకొని వ్యక్తిగత రుణాలు ఇస్తామని ప్రభుత్వం దరఖాస్తులు తీసుకొని రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇప్పటికీ పెన్షన్ రాలేదు, అనేకమందికి ఇంటి స్థలాలు లేవు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వటం లేదు, కొంతమంది డిగ్రీలు పీజీలు చదువుకున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు ప్రైవేటు ఉద్యోగాలు ఇచ్చిన పరిస్థితి లేదు, ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సమస్యలన్నీ పరిష్కారం చేసి వారి ఆదుకోవాలని అన్నారు, గల్లి నుంచి ఢిల్లీ దాకా ఏకం చేసి వికలాంగుల అందరితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన పోరాటాల నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజు, మండల కార్యదర్శి లకన్ సింగ్, మండల ఉపాధ్యక్షులు వడ్డెన్న, మండల సాయి కార్యదర్శి ఉప్పు సాయికుమార్, పడమటిహరీష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రిలో హనుమాన్ జయంతి వేడుకల కోలాహలం

భద్రాచలం మే 12 (జన సంఘర్షణ)





దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాద్రి పుణ్యక్షేత్రం హనుమాన్ జయంతి వేడుకలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. వైశాఖ బహుళ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రం నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చిన హనుమాన్ దీక్షాధారులతో భద్రాద్రి పరిసరాలన్నీ కేసరి వర్ణమయంగా మారాయి. 'జై శ్రీరామ్' మరియు 'వీర హనుమాన్' నామస్మరణలతో గోదావరి తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయాన్నే ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి, సింధూర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. హనుమాన్ దీక్షాధారులు తమ ఇరుముడులను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం అధికారులు క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మంచినీరు, నీడ వంటి ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. కేవలం ఒక మతపరమైన ఆచారంగానే కాకుండా, హనుమంతుడిలో ఉన్న శక్తి, యుక్తి, రామచంద్రునిపై ఉన్న అపారమైన భక్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా పలువురు పండితులు ఉద్ఘాటించారు. సమాజంలో ధైర్యం, క్రమశిక్షణ వెల్లివిరియడానికి ఇలాంటి ఆధ్యాత్మిక పండుగలు వేదికలుగా నిలుస్తున్నాయి. అయితే, ఇంతటి భారీ జనసందోహం వచ్చే సమయంలో క్షేత్రస్థాయిలో శాశ్వత వసతుల అవసరం మరోసారి చర్చకు వస్తోంది. భక్తుల సౌకర్యార్థం మరిన్ని వసతి గృహాలు, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. నిధుల కేటాయింపు కాగితాలకే పరిమితం కాకుండా, రాబోయే గోదావరి పుష్కరాల నాటికి భద్రాద్రిని ఒక అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యాంత్రికమైన ఆధునిక జీవనంలో పడి కొట్టుమిట్టాడుతున్న నేటి తరానికి, భద్రాద్రిలో వినిపించే ఈ రామనామ స్మరణ ఒక మానసిక ప్రశాంతతను, కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. రామభక్తుడు ఉన్న చోట రామాయణం కొలువై ఉంటుందనే సత్యాన్ని భద్రాద్రి మరోసారి చాటిచెప్పింది. ఈ ఆధ్యాత్మిక వైభవం భావి తరాలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షిద్దాం.

# భద్రాద్రి పునర్నిర్మాణానికి అంకురార్పణ

- రూ. 200 కోట్లతో టెండర్ల సందడి!

భద్రాచలం మే 12 (జన సంఘర్షణ)



శతాబ్దాల చరిత్ర కలిగిన భద్రాద్రి రామాలయ రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం భారీ కార్యాచరణకు తెరలేపింది. ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల నిమిత్తం రూ. 200 కోట్ల 89 వేలతో ఆర్అండ్‌బీ శాఖ తాజాగా టెండర్లు ఆహ్వానించింది. మొత్తం 1,058 పనుల కోసం చేపట్టిన ఈ ప్రక్రియలో భాగంగా, పాత భవనాల తొలగింపునకే రూ. 5 కోట్లు కేటాయించడం గమనార్హం. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు అత్యున్నత స్థాయి వసతులు కల్పించడమే లక్ష్యంగా 30 నెలల గడువుతో ఈ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. కేవలం కాంక్రీటు కట్టడాల విస్తరణకే పరిమితం కాకుండా, ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడేలా ఈ నిధులు ఖర్చవుతాయా లేదా అన్నది ఇప్పుడు కాలమే నిర్ణయించాలి. ప్రతి పైసా రాముడి సేవకే అంకితమై, భద్రాద్రి వైభవం ప్రపంచవ్యాప్తం కావాలని ఆశిద్దాం.

# అటవీ అధికారుల 'వసూళ్ల' పర్వం

- ఆదివాసీల బైక్ కావాలంటే రూ. 70 వేలు కట్టాల్సిందేనా?

భద్రాచలం మే 12 (జన సంఘర్షణ)



అడవిని నమ్ముకుని బతికే ఆదివాసీలపై అటవీ శాఖాధికారుల ప్రతాపం మితిమీరుతోంది. ఇళ్ల నిర్మాణానికి కర్రలు నరికారనే సాకుతో, బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ ప్రాంతానికి చెందిన ఆదివాసీల ఇంటి ముందున్న బైక్‌ను అధికారులు బలవంతంగా తీసుకెళ్లడం కలకలం రేపుతోంది. పోయిన వాహనాన్ని తిరిగివ్వాలంటే ఏకంగా రూ. 70 వేలు డిమాండ్ చేస్తున్నారని, చివరకు రూ. 36 వేలు 'సెటిల్' చేస్తేనే బండి ఇస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రక్షణ కల్పించాల్సిన చట్టమే వేధింపులకు గురిచేస్తుంటే, అమాయక గిరిజనులు ఎవరికి మొరపెట్టుకోవాలని సామాజికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఐటీడీఏ అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ అక్రమ వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట వేసి, బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అడవి బిడ్డల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అధికారులు సాగిస్తున్న ఈ 'దందా' వ్యవస్థకే మాయని మచ్చ. ఇళ్ల కోసం నాలుగు కర్రలు కొట్టుకుంటే వాహనాన్ని సీజ్ చేయడం ఏ చట్టంలో ఉందని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఒక సామాన్యుడి రెక్కల కష్టంతో కొనుక్కున్న బైక్‌ను వదిలేందుకు వేలల్లో బేరసారాలు ఆడటం చూస్తుంటే, అక్కడ అడవి పాలన సాగుతోందా లేక అధికారుల ఇష్టారాజ్యం నడుస్తోందా అన్న అనుమానం కలగక మానదు. గిరిజన సంక్షేమం గురించి వేదికలపై గొప్పలు చెప్పే పాలకులు, ఇలాంటి క్షేత్రస్థాయి వేధింపులపై ఎందుకు మౌనంగా ఉంటున్నారో ఆలోచించాలి.

# సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు సందర్శించారు

బోధన్ మే 12 జన సంఘర్షణ



నిజామాబాద్ నగరంలో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి బెజ్గం సుజాత మాట్లాడుతూ నగరంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు రిపేర్ చేసే నగరంలో ఉన్న నిరుపేదలకు అందే విధంగా చూడాలి ప్రభుత్వం కోరారు. మరమత్తుల కోసం కోటిన్నర సాంక్షన్ చేశామని చెప్తున్నారు. కానీ ఇప్పటివరకు ఎక్కడ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రిపేరు ప్రారంభించలేరు. కాబట్టి ఎప్పుడైనా వాటి మరమ్మత్తులు చేయించి నిరుపేదలకు అందించే విధంగా చూడాలని గత ప్రభుత్వం చేసిన పొరపాటు ఈ ప్రభుత్వం చేయకూడదు గత ప్రభుత్వం వారి అనుచరులకు ఎవరు డబ్బులు ఇస్తే వారికి డబల్ బెడ్ రూమ్ సాంక్షన్ చేయాలనే ప్రయత్నం చేయడంతో ఈ పంపిణీ ఆగిపోయింది. కాబట్టి ఇప్పుడు వచ్చిన ప్రభుత్వం పొరపాటు చేయకుండా నిరుపేదలకు వచ్చే విధంగా చూడాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ లేదంటే రేపు రానున్న రోజుల్లో ప్రజలందరినీ ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు నలువాల నరసయ్య, ఆడవాళ్ళ అనిత, దేరంగుల దీపిక, ఎస్కే రజియా, పి.శ్రీదేవి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందూర్ హైస్కూల్ విద్యార్థులకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సన్మానం

బోధన్ మే 12 జన సంఘర్షణ



నిజామాబాద్ జిల్లా, బోధన్‌లోని ఇందూర్ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల విడుదలైన ఎస్ఎస్సీ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి వారిని సన్మానించి అభినందించారు. సిబ్బల్ వార్ రామ్ చరణ్, పి. హర్ష వర్ధన్, బి. గణేష్ కుమార్ లు ఉత్తమ మార్కులు సాధించారు. విద్యార్థులు నిరంతర శ్రమ, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిషోర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# శ్రీ హనుమాన్ జయంతి మహోత్సవ వేడుకలు

- బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్

హైదరాబాద్ డెస్క్ మే 12 జనసంఘర్షణ

శ్రీ హనుమాన్ జయంతి మహోత్సవం సందర్భంగా గాంధీనగర్ డివిజన్ లోని చిక్కడపల్లి బాపు నగర్ శ్రీ హనుమాన్ దేవాలయం, వివేక్ నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివేక్ నగర్ ఆలయం ఈ ఓ దేవనాథం, ఆలయ పునర్నిర్మాణం కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, బిజెపి నాయకులు శ్రీకాంత్, ఆనంద్ రావు,మధు గౌడ్, బాపు నగర్ ఆలయ కమిటీ సభ్యులు శంకర్ గౌడ్, శివ శంకర్, ప్రవీణ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



జన సంఘర్షణ
బుధవారం 13 మే 2026

# దద్దరిల్లిపోతున్న అశ్వరావుపేట బెల్ట్ షాప్ దందా

- మద్యం ప్రియుల నడ్డి విరుస్తున్న 'బెల్ట్' దందా, పోలీసుల ద్వంద్వ వైఖరిపై ఆగ్రహం
- బెల్టు షాపులు వదిలి, మద్యం సేవించిన వారిపైనే దాడి
- అక్రమాలను ప్రశ్నిస్తే' తాగుబోతు' ముద్ర వేసి, మాఫియా అక్రమాలకు రక్షణ కవచం
- మద్యం విక్రయించడం ప్రభుత్వ బాధ్యత అయినప్పుడు, మద్యం ప్రియులను నేరస్తులుగానే ఎందుకు చూస్తున్నారు?
- మద్యం ప్రియులను కోర్టుల చుట్టూ ప్రదక్షణలు చేపించి ఆర్థిక మరియు మానసిక క్షోభకు గురిచేస్తున్న వైనం- సిండికేట్ ధరలతో మద్యం ప్రియుల జేబులకు చిల్లు




11-5-2026 జన సంఘర్షణ


రాష్ట్రంలో మద్యం విక్రయాలు ఆదాయ వనరుగా మారాయో లేక సామాన్యుడి బలహీనతగా మారాయో తెలియదు కానీ, భద్రాద్రి జిల్లాలో మద్యం ప్రియుల పరిస్థితి మాత్రం 'ముందు నుయ్యి వెనుక గొయ్యి'లా తయారైంది. ఒకవైపు సిండికేట్ ధరలు, మరోవైపు బెల్ట్ షాపుల దోపిడీ, వీటన్నింటికీ తోడు పోలీసుల వేధింపులతో సగటు మద్యం ప్రియుడు విలవిలలాడుతున్నాడు.

**సమయం ఆదా..కానీ జేబుకు చిల్లు:**

గతంలో మద్యం కావాలంటే కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. దీనివల్ల సమయం వృధా అవడమే కాకుండా, నిద్రలేమి, ఆరోగ్య సమస్యలు తలెత్తేవి. అయితే, ఇప్పుడు ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారుల "కృప" వల్ల పల్లెల్లో వీధికో బెల్ట్ షాపు వెలిసింది. ఇంటి సమీపంలోనే మందు దొరుకుతుండటంతో సమయం కలిసి వస్తుందని సంతోషించే లోపే.. ధరల రూపంలో షాక్ తగులుతోంది. లైసెన్స్ షాపుల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి బెల్ట్ షాపులకు అధిక ధరలకు విక్రయిస్తుంటే, బెల్ట్ షాపు నిర్వాహకులు సామాన్యుడి నుంచి అంతకు మించి వసూలు చేస్తూ నడ్డి విరుస్తున్నారు. ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా వసూలు చేస్తూ సామాన్య కూలీల సంపాదనను దోచుకుంటున్నారు. ఎక్సైజ్ అధికారుల కళ్ళ ముందే ఈ సమాంతర వ్యవస్థ నడుస్తున్నా నిమ్మకు నిరీత్తినట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

**దీనికి తోడు పోలీసుల 'బ్రీత్ అనలైజర్' బాదుడు:**

మద్యం విచ్చలవిడిగా లభించేలా చూస్తున్న యంత్రాంగం, అది తాగిన వారిపై మాత్రం ప్రతాపం చూపుతోంది. బెల్ట్ షాపులు కళ్ళ ముందే కనిపిస్తున్నా పట్టించుకోని పోలీసు విభాగం, తాగిన వ్యక్తి బయటకు




రాగానే 'బ్రీత్ అనలైజర్' అంటూ విరుచుకుపడుతోంది. అర్ధరాత్రి దాటినా విచ్చలవిడిగా సాగే బెల్టు షాపుల నిర్వహణ పోలీసులకు కనిపించకపోవడం గమనార్హం. పబ్లిక్ న్యూసెన్స్ ,శాంతి భద్రతల పేరుతో కేసుల నమోదు ఏ రకమైన న్యాయమని మద్యం ప్రియులు ప్రశ్నిస్తున్నారు. కోర్టుల చుట్టూ తిప్పడం మరో కోణం. జరిమానాలే కాకుండా, కోర్టుల చుట్టూ తిరుగుతూ మద్యం ప్రియులు తమ విలువైన పని దినాలను కోల్పోతున్నారు. మూడంచెల పన్ను: అటు సిండికేట్ ధరలు, ఇటు బెల్ట్ షాపుల అదనపు రేట్లు, చివరగా పోలీసుల ఫైన్లు.. ఇలా మూడు రకాలుగా మద్యం ప్రియుడు దోపిడీకి గురవుతున్నాడు.

**ప్రశ్నార్థకంగా అధికారుల నిఘా. .**

మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ, సామాన్యుడి రక్షణపై అధికారులకు లేకపోవడం గమనార్హం."బెల్ట్ షాపులు ఎక్సైజ్ అధికారులకు కనిపించవు, అర్ధరాత్రి వరకు జరిగే దందాలు పోలీసులకు కనబడవు.. కానీ తాగిన వాడు మాత్రం వీరికి నేరస్తుడిగా కనిపిస్తాడు." అని మద్యం ప్రియులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుస్తున్న మద్యం ప్రియులకు కనీసం గౌరవం కరువైంది. ఈ వ్యవస్థను ప్రక్షాళన చేసే నాథుడు ఎవరని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బెల్ట్ షాపుల అక్రమ దందాను అరికట్టడంతో పాటు, మద్యం ప్రియులపై జరుగుతున్న అనవసర వేధింపులను అరికట్టాలని కోరుతున్నారు. మద్యం విక్రయించడం ప్రభుత్వ బాధ్యత అయినప్పుడు దానిని సేవించే వ్యక్తిని కేవలం నేరస్తుడిగానే ఎందుకు చూస్తున్నారు?

## బండి సంజయ్ కుమారుడి వ్యవహారం: సర్కారు మౌనంపై బీఆర్ఎస్ నిప్పులు

ఇల్లందు మే 12 (జన సంఘర్షణ)



రాష్ట్రంలో మహిళల రక్షణ కేవలం కాగితాలకే పరిమితమా లేక అధికార రాజకీయాల మధ్య నలిగిపోతోందా అనే అనుమానం కలుగుతోంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ ఒక మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని ఇల్లందు బీఆర్ఎస్ నాయకత్వం నిలదీసింది. అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన చోట, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి బాధితులకు అన్యాయం చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మైనర్ బాలిక గౌరవానికి భంగం కలిగితే, తక్షణమే ఫోక్సో చట్టం కింద చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉంటుంది. అయితే, నిందితుడు ఒక కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో, చట్టం తన పని తాను చేయకుండా రాజకీయ ప్రయోజనాల కోసం పక్కన పెట్టబడిందా అనే ప్రశ్న ఉదయిస్తోంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదాసీనతను ప్రశ్నిస్తూ, న్యాయం జరగాల్సిన చోట రాజీ పడటం మహిళా భద్రత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని శంకిస్తోందని బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు నెమలి ధనలక్ష్మి, సీనియర్ నాయకులు మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షం, ప్రతిపక్షం అనే భేదం లేకుండా మహిళలపై జరిగే అకృత్యాలను ఖండించాల్సి ఉంటుంది. కానీ, ఈ ఉదంతంలో డీకే అరుణ, రేణుకా చౌదరి వంటి సీనియర్ మహిళా నాయకురాళ్లు మౌనం వహించడం వెనుక ఉన్న అంతర్గత రాజకీయ బంధాలేమిటో ప్రజలు గమనిస్తున్నారు. ఎక్కడో గల్లీలో చిన్న గొడవ జరిగితే గొంతు చించుకునే ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు మహిళా విభాగాలకు ఒక కేంద్ర మంత్రి కుమారుడి అంశం వచ్చేసరికి గొంతు మూగబోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలు సమాజానికి ఏ విధమైన సందేశాన్ని ఇస్తున్నాయి? చట్టం సామాన్యుడికి ఒకలా, ఉన్నత పదవుల్లో ఉన్నవారికి మరోలా పనిచేస్తుందా? కేంద్రంలో దేశ రక్షణ గురించి మాట్లాడే హోం శాఖ సహాయ మంత్రి, తన సొంత గడపలో జరిగిన ఈ బాధ్యతారాహిత్యానికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని రాజకీయ చదరంగం ఆపాలని, బాధితురాలికి అండగా నిలిచి నిందితుడిని కఠినంగా శిక్షించడమే మహిళా సంరక్షణ పట్ల ఉన్న నిజమైన గౌరవమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధికారం శాశ్వతం కాదు, కానీ వ్యవస్థల పట్ల ప్రజలకు ఉండే నమ్మకం శాశ్వతం. చట్టాన్ని చుట్టంగా మార్చుకుంటే రేపు సామాన్యుడి రక్షణకు భరోసా ఎక్కడి నుంచి వస్తుంది? ఇల్లందులో బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన ఈ నిరసన కేవలం ఒక పార్టీ పోరాటం కాదు, అది వ్యవస్థలో పేరుకుపోయిన పక్షపాత వైఖరిపై సామాన్యుడి తరపున వినిపిస్తున్న ఆక్రందన. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిందితుడిపై తక్షణ చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో మహిళా లోకం నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని వారు హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అజ్మీర బావ్ సింగ్, వీరభద్రం, హరిప్రసాద్, సిల్వేరి సత్యనారాయణ, ధ్యాసం ప్రమోద్ కుమార్, సూర్ణపాక సత్యనారాయణ, వేమురు సుజాత, సంతోషి పాసి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ల కోసమే మోదీ పాలన: మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు




ఇల్లందు మే 12 (జన సంఘర్షణ)

దేశానికి వెన్నెముక అని చెప్పుకునే రైతు నేడు పాలకుల నిర్లక్ష్యంతో కునారిల్లిపోతున్నాడని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు ఎర్రవాసి వేస్తోందని మాజీ ఎంపీ, ప్రముఖ రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఇల్లందులోని రాయల చంద్రశేఖర్ ప్రాంగణంలో జరిగిన అఖిలభారత ఐక్య రైతు సంఘం వ్యవస్థాపక మహాసభల్లో ఆయన ప్రసంగిస్తూ.. పారిశ్రామిక ఉత్పత్తులకు లభించే ధరల నిర్ణయాధికారం వ్యవసాయ ఉత్పత్తులకు ఎందుకు లేదని ప్రశ్నించారు. లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా చలించని కేంద్ర ప్రభుత్వం, బడా కార్పొరేట్లకు ఏకంగా 16 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేయడం పాలకుల ప్రాధాన్యతలు ఎటువైపు ఉన్నాయో స్పష్టం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మత విభజన రాజకీయాలతో పబ్బం గడుపుకుంటూ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీ వైఖరి దేశ ప్రజాస్వామ్యానికే ముప్పుగా పరిణమించిందని ఆయన హెచ్చరించారు

## సేవకు ప్రతిరూపం 'నర్సు': ప్రాణదాతల త్యాగానికి నివాళి


ఇల్లందు మే 12 (జన సంఘర్షణ)



మనిషి మరణం అంచున ఉన్నప్పుడు వైద్యుడు కేవలం చికిత్స మాత్రమే చేస్తాడు, కానీ ఆ ప్రాణాన్ని మళ్లీ నిలబెట్టడానికి అహర్నిశలు శ్రమించేది మాత్రం నర్సులేనని ఇల్లందు ప్రభుత్వ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్ స్పష్టం చేశారు. మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ, సేవకే భాష్యం చెప్పిన ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆశయాలను నేటి నర్సింగ్ అధికారులు కొనసాగించడం అభినందనీయమన్నారు. కేవలం వృత్తిగా కాకుండా, ఒక బాధ్యతగా, కన్నబిడ్డలను సైతం వదిలి రోగుల సేవలో తరించే నర్సుల సేవలు నిజంగా వెలకట్టలేనివి. ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన పలువురు నర్సులను ఘనంగా సన్మానిస్తూ, రోగి ముఖంలో కనిపించే చిరునవ్వే నర్సులకు అసలైన అవార్డు అని అభివర్ణించారు. సమాజం వైద్యుడిని దేవుడిగా చూస్తుందేమో కానీ, ఆ దేవుడి ప్రతిరూపంగా నిలబడి ప్రాణవాయువు పోసే నర్సులను గౌరవించడం మనందరి కనీస బాధ్యత. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాం నివాస్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఫర్జానా, వైద్య సిబ్బంది పాల్గొని నర్సుల వృత్తి పవిత్రతను కొనియాడారు.

## నైపుణ్యమే అసలైన ఆయుధం: ఇల్లందు వైటీసీలో రేపే జాబ్ మేళా

ఇల్లందు మే 12 (జన సంఘర్షణ)



కేవలం సర్టిఫికెట్ల వేటలో పడి అసలైన ఉపాధి నైపుణ్యాలను విస్మరిస్తున్న నేటి తరుణంలో, భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళా నిరుద్యోగ యువతకు ఒక గొప్ప దిక్సూచిలా నిలుస్తోంది. ఇల్లందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 15న నిర్వహించబోయే 'వేర్‌హౌస్ అసోసియేట్' కోర్సు రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కేవలం ఒక శిక్షణ కార్యక్రమం మాత్రమే కాదు; అది ఒక యువకుడి లేదా యువతి యొక్క ఆర్థిక స్వావలంబనకు వేస్తున్న తొలి అడుగు. సుమారు నాలుగు నెలల పాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తూ, ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, ఆపై నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం అనేది గిరిజన అభివృద్ధి సంస్థ తీసుకున్న సాహసోపేతమైన మరియు నిర్మాణాత్మకమైన నిర్ణయం. అవకాశాలు మన తలుపు తట్టినప్పుడు వాటిని అందిపుచ్చుకోవడంలోనే మేధస్సు ఉందనే సత్యాన్ని యువత గ్రహించాలి. అందుకే, కేవలం కాలక్షేపంతో కాలం గడపకుండా, జేడీఎం హరికృష్ణ సూచించిన విధంగా 7815990413 లేదా 89193 00047 నంబర్లను సంప్రదించి, ఈ అవకాశాన్ని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటగా మార్చుకోవాలని ఆశిద్దాం.

## దేశ ప్రగతికి 'జన గణన' దిక్సూచి: పౌరుల భాగస్వామ్యం అనివార్యం

ఇల్లందు మే 12 (జన సంఘర్షణ)



ఒక దేశం ప్రగతి పథంలో పయనించాలంటే ఆ దేశ వనరులు, ప్రజల జీవన ప్రమాణాలపై స్పష్టమైన గణాంకాలు ఉండటం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో, ప్రతి పదేళ్లకోసారి జరిగే జన గణన ప్రక్రియ కేవలం అంకెల సేకరణ కాదు, అది రేపటి తరాల భవిష్యత్తుకు వేసే బలమైన పునాది అని 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ ఉద్ఘాటించారు. మంగళవారం వార్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మే 11 నుండి జూన్ 9 వరకు జరిగే ఈ సర్వేలో ప్రతి కుటుంబం అందించే సమాచారం, ప్రభుత్వ పథకాలు అసలైన లబ్ధిదారులకు చేరడంలో కీలక పాత్ర పోషిస్తుందని గుర్తుచేశారు. వార్డును మూడు బ్లాకులుగా విభజించి, రోడ్డు మ్యాపుల ద్వారా ఎన్యూమరేటర్లకు, అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, ఇంటింటికి వచ్చే సిబ్బందికి ప్రజలు పారదర్శకమైన వివరాలను అందించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గుర్తుంచుకోండి, మనం నేడు ఇచ్చే సరైన సమాచారమే రేపు మన ప్రాంతంలో నిర్మించబడే పాఠశాలలు, ఆసుపత్రులు, ఇతర సంక్షేమ పథకాల రూపకల్పనకు ప్రాతిపదిక అవుతుంది. బాధ్యతాయుతమైన పౌరుడిగా నిజాన్ని చెప్పడం మన కనీస ధర్మం. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్ బొర్ర తులసమ్మ, వార్డు ఆఫీసర్ రజిని తదితరులు పాల్గొని ప్రజల్లో చైతన్యం నింపారు.

## హనుమాన్ జయంతి మహోత్సవంలో పాల్గొన్న జనసేన నాయకులు ప్రేమ కుమార్

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 12 (జన సంఘర్షణ):




అల్లాపూర్ డివిజన్ వివేకానంద నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం కమిటీ చైర్మన్, సభ్యుల ఆహ్వానం మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హనుమాన్ జయంతి సందర్భంగా జరిగిన ప్రత్యక పూజలలో భజన కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రేమకుమార్‌ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, బండారు ప్రసన్నాంజనీయలు, తుంగం శ్రీనివాస్ రావు, బొల్లి శ్రీనివాస్ రావు, పవన్, తుంగ రామారావు, జల్ల రవి, ఆర్. జగన్నాథం, మధు, దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తికి నిదర్శనం.. సేవకు ప్రతిరూపం

- సాగరపాకలో అన్నప్రసాద వితరణ మహోత్సవం

బూర్గంపాడు మే 12 (జన సంఘర్షణ)



ఆధ్యాత్మికత అంటే కేవలం దేవాలయాలకు వెళ్లడం మాత్రమే కాదు, సాటి మనిషి ఆకలిని తీర్చడం కూడా పరమ పవిత్రమైన పూజ అని సాగరపాకలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలు నిరూపించాయి. మంగళవారం శ్రీ అంజనా ఆనియన్స్ & ట్రేడర్స్ ఆధ్వర్యంలో నాగరత్నం-దేవి రేఖ దంపతులు గత 15 ఏళ్లుగా కొనసాగిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఈసారి కూడా అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భద్రాచలం శ్రీ నృసింహ సేవా వాహిని వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి చేతుల మీదుగా వితరణ ప్రారంభమైంది. సుమారు 2000 మంది భక్తులకు కడుపునిండా అన్నప్రసాదం అందించడమే కాకుండా, భద్రాచలంలోని వృద్ధాశ్రమాలకు, మారుమూల గిరిజన ప్రాంతాల్లోని హనుమాన్ ఆలయాలకు కూడా ఇక్కడి నుండే ప్రసాదాన్ని చేరవేయడం వారి సేవా దృక్పథానికి నిదర్శనం. సుదూర ప్రాంతాల నుండి మాలలు ధరించి భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చే హనుమాన్ భక్తులకు ఈ అన్నదానం ఒక గొప్ప ఊరటనిచ్చింది. రాజకీయాలు, వ్యాపారాల మధ్య మానవత్వం మంటగలిసిపోతున్న నేటి కాలంలో, సమాజంలోని నిస్సహాయులను, వృద్ధులను గుర్తుంచుకుని చేస్తున్న ఈ త్యాగపూరిత సేవ నిజంగా అభినందనీయం. ఇలాంటి సేవా గుణమే మన సంస్కృతికి అసలైన జీవనాడి.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న హెచ్.ఎ.ల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్మోహనరావు

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 12 (జన సంఘర్షణ):



హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బాలానగర్ హెచ్.ఎ.ల్ టౌన్షిప్ లో ఉన్న హనుమాన్ టెంపుల్ లో హెచ్.ఎ.ల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్మోహనరావు చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ మురళీకృష్ణ పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీక అయిన ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, విజయాలతో ముందుకు సాగాలని కోరుకుంటున్నాము. దేశాభివృద్ధి, సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని ఆకాంక్షిచారు. ఈ కార్యక్రమంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ ఏరోనాటిక్స్ డి.జి.ఎం హెచ్.ఆర్ సూర్యకుమార్ రౌత్, వెల్ఫేర్ ఫండ్ మేనేజర్ జయశ్రీ, గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కన్వీనర్ వెంకటాద్రి, గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్,ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజ్, గణేష్, చంద్రరావు నాయక్, డిప్యూటీ ప్రధానకార్యదర్శి జోగారావు, రామచందర్, జాయింట్ సెక్రటరీ వడ్డే నాగార్జున, పోలేపల్లి శ్రీకాంత్,వెంకటేష్,రాజు, నవీన్, రమణ, కృష్ణబాబు, నాగరాజ్,ఆలయ కమిటీ సభ్యులు స్వామి, పవన్,చలం, బాబూరావు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు

- **హనుమంతుడు మీకు బలం,ధైర్యం,విజయాన్ని ప్రసాదించాలి.**
- **టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్.**

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, మే 12 (జన సంఘర్షణ):



హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మాతృశ్రీ నగర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్, ఇజ్జత నగర్ డివిజన్ పరిధిలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. శ్రీ హనుమంతుడు భగవంతునిపై అచంచలమైన భక్తి ఎలా ఉండాలో ప్రపంచానికి చూపించారని,శ్రీరాముడి సేవనే జీవిత లక్ష్యంగా భావించి నిస్వార్థంగా పనిచేశారని.అందుకే ఆయనను భక్త శిరోమణి అని పిలుస్తారని అన్నారు. ఈ పూజ కార్యక్రమంలో స్థానిక నాయకులు సయ్యద్ గౌస్,ఏకే బాలరాజ్, సాంబశివరావు, జంగయ్య యాదవ్, గంగల శ్రీనివాస్ యాదవ్, గంగల గణేష్ యాదవ్, వెంకటేష్ సాగర్, మహేష్, వెంకట్ రెడ్డి, ముక్తార్, ఇస్మాయిల్, లతీఫ్, శశిరేఖ, శ్రీజ రెడ్డి ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు గడప వద్దకే 'ఐఐటీ' కల: శ్రీ చైతన్య అకాడమీతో విద్యా విప్లవం

ఇల్లందు మే 12 (జన సంఘర్షణ)




విద్యా రంగంలో అగ్రగామిగా వెలుగొందుతున్న శ్రీ చైతన్య సంస్థలు, ఏజెన్సీ హృదయస్థలి ఇల్లందులో ఐఐటీ ఌ నీట్ అకాడమీని ప్రారంభించడం ఈ ప్రాంత విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది. సాధారణంగా ఐఐటీ, నీట్ వంటి ఉన్నత స్థాయి శిక్షణ కోసం విద్యార్థులు హైదరాబాద్ లేదా విజయవాడ వంటి నగరాలకు వలస వెళ్లాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు ఆ స్థాయి ప్రమాణాలను, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందాన్ని ఇల్లందు విద్యార్థుల ముంగిటకే తీసుకురావడం సాహసోపేతమైన మరియు ప్రశంసనీయమైన నిర్ణయం. 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభిస్తూ ప్రిన్సిపల్ పత్తి శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కేవలం బోధనకే పరిమితం కాకుండా, హాస్టల్ సౌకర్యం, నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక స్టడీ మెటీరియల్తో ప్రతి విద్యార్థిని ఒక విజేతగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ముఖ్యంగా పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్షిప్స్ అందించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. మన ప్రాంత బిడ్డలు కూడా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించగలరనే ఆత్మవిశ్వాసాన్ని ఈ అకాడమీ కలిగిస్తోంది; తల్లిదండ్రులు ఈ అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకుని తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన సమయం ఆసన్నమైంది.

# జనసేన ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

- **భక్తిభావంతో హనుమాన్ జయంతి**

ఇల్లందు మే 12 (జన సంఘర్షణ)

హనుమాన్ జయంతి అంటే కేవలం వేడుక మాత్రమే కాదు, అది శక్తికి, భక్తికి నిస్వార్థ సేవకు నిదర్శనం. ఆంజనేయ స్వామి ఎలాగైతే రామకార్యం కోసం తన జీవితాన్ని అంకితం చేశారో, అదే స్ఫూర్తితో సమాజ సేవలో భాగస్వాములు కావడమే ఆ స్వామికి మనం ఇచ్చే నిజమైన నివాళి. ఈ క్రమంలోనే, పవిత్రమైన హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఇల్లందులో ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యత కూడా వెల్లివిరిసింది. ఎమ్మార్వో ఆఫీస్ మార్గంలో జనసేన పార్టీ తరపున భక్తుల దాహార్తిని, ఆకలిని తీర్చేలా మజ్జిగ, పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం. 'అన్నదానం పరమోధర్మం' అన్నారు పెద్దలు; ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే మిన్నయైన సేవ మరొకటి లేదు. ఎండవేడిమిలో ప్రయాణించే భక్తులకు చల్లని మజ్జిగను, స్వామి ప్రసాదంగా పులిహోరను అందిస్తూ జనసేన నాయకులు






తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. కేవలం భక్తి పాటలకు, పూజలకు పరిమితం కాకుండా, ఆకలితో ఉన్న సాటి మనిషిని ఆదుకోవడంలోనే అసలైన ధర్మం దాగి ఉంది. హనుమంతుడి ఆశీస్సులతో సమాజంలో ఇలాంటి సేవా దృక్పథం పెరగాలని, ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందిస్తూ లోక కల్యాణానికి కృషి చేయాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. నాయకత్వం అంటే కేవలం పదవి కాదు, అది ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమేనని ఈ యువ నాయకులు నిరూపించారు. ఈ కార్యక్రమంలో మద్ది సాయికుమార్, వీరబ్రహ్మం, శాంతిరాజ్, మధు, శ్రావణ్, కలీం, ఐలాపురం సన్నీ, సందీప్, పిట్టల సతీష్ తదితరులు చురుగ్గా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రాజకీయాల కంటే ప్రజా సేవ మిన్న అనే భావనతో, ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో పలకరిస్తూ చేసిన ఈ పంపిణీ స్థానికుల ప్రశంసలు అందుకుంది. సేవలో ఉన్న తృప్తి మరెక్కడా దొరకదని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 12 (జన సంఘర్షణ):

పవనపుత్ర హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు హనుమాన్ ఆలయాలను రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా రామభక్త హనుమాన్ స్వామివారి దివ్యదర్శనం చేసుకొని ఆలయాలలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో



ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు భక్తులు వడ్డేపల్లి రాజేశ్వరరావుకి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ హనుమంతుడు భక్తి, శక్తి, సేవా భావానికి ప్రతీక అని పేర్కొన్నారు. శ్రీరాముడిపై హనుమంతుడికి ఉన్న అచంచల భక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. యువత ధర్మ పరిరక్షణ, దేశభక్తి, సేవా తత్వంతో ముందుకు సాగాలని సూచించారు. హనుమాన్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని శ్రీ ఆంజనేయ స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# అంతర్జాతీయ నర్సుల దినోత్సవం వేడుకలు

- **భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సులకు ఘనంగా సన్మానం**

వరంగల్ జిల్లా ప్రతినిధి అంజిబాబు, మే 12 (జన సంఘర్షణ):




వరంగల్ జిల్లా రామన్నపేటలోని డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చే ఘనంగా శాలువాతో మరియు బొకేతో సన్మానించడం జరిగింది.

ఈ సందర్భంగా మేనేజ్ ఇంట్రెస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అవర్ నర్సస్ , అవర్ ఫ్యూచర్ ,ది ఎకనామిక్ పవర్ అఫ్ కేర్ మన నర్సులు, మన భవిష్యత్తు, సంరక్షణ ఆర్థిక శక్తి మానవతా సేవలో మార్గదర్శకులైన నర్సులకు వందనం అని అన్నారు. ప్రజా ఆరోగ్య సంరక్షణలో వారి సేవలు అద్భుతం అని పేర్కొన్నారు. ప్రాణం పోసేది డాక్టర్ అయినా ఆ ప్రాణాన్ని కంటికి రెప్పలా కాపాడేది వీరే. నిస్వార్థ సేవకు, అంకిత భావానికి శిరస్సు వంచి నమస్కరిస్తామన్నారు. ప్రపంచంలోని అందరికీ వందనం నర్సులను ఘనంగా శాలువా మరియు బొకేతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ క్రాంతి కుమార్, ఆర్గనైజర్ శ్రావణ్ ,చిలకపల్లి భవాని, ఉప్పాల శారద లను వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రంలో ధాన్యం సేకరణ మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు**

రాష్ట్రం జిల్లా కలెక్టర్/మే 12/(జన సంఘర్షణ)

మిషన్ మోడ్లో పనిచేస్తూ రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోళ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని కలెక్టర్లను ఆదేశించారు. "కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలి. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్లకు తరలించాలి. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించరాదు. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దు. ధాన్యం లోడింగ్ విషయంలో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలి. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలి. అలా చేయడం వల్ల తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చు" అని చెప్పారు. లారీల కొరత ఉంటే దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని, ధాన్యం తరలించడానికి అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని ఈ సందర్భంగా రవాణా శాఖ కమిషనర్ను ఆదేశించారు. "పలు ప్రాంతాల్లో గోదాముల సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. అవసరమైన చోట రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను అందుబాటులోకి తీసుకుని ధాన్యాన్ని తరలించాలి. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలుండాలి" అని సూచించారు. ప్రాంతాల వారిగా సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారితనంతో వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించే అధికారులు, కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని ఆదేశించారు. అకాల



వర్షాల సమయంలో రైతులకు నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఇలాంటి సమయాల్లో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలి. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతీ ఐకేపీ సెంటర్కు ఒక అధికారిని నియమించాలి. ప్రతి రైస్మిల్లు వద్ద ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , తుమ్మల నాగేశ్వర రావు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు లతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# వరుస దొంగలతో ప్రజల హడల్..!

◆ **బీర్కూరులో నాలుగు ఇండ్లలో చోరీ**

కామారెడ్డి /బాన్సువాడ శ్రీనగర్/మే 12/(జన సంఘర్షణ)

ఉమ్మడి జిల్లాలో దొంగలు వరుస చోరీలతో కలకలం రేపుతున్నారు. నిజామాబాద్ నగరంలోని శ్రీనగర్ కాలనీలో మహిళ మెడలోంచి మూడున్నర తులాల బంగారు గొలుసును బైక్పై వచ్చిన దుండగులు లాకెళ్లారు. వర్ని మండలం శ్రీనగర్లో ఏడు ఇళ్ల తాళాలు పగలగొట్టి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్లో 8 ఇళ్లలో దొంగలు పడి బీభత్సం సృష్టించారు. మండల కేంద్రమైన బీర్కూరులో సోమవారం అర్ధరాత్రి 4 ఇళ్లల్లో దొంగలు చొరబడి నగలు, నగదులు దొంగలించుకొని పారిపోయారు. బీర్కూర్ పోలీస్ స్టేషన్లో కావలసినంత సిబ్బంది లేకపోవడంతో ఉన్న కొద్దిమంది సిబ్బందితో పోలీస్ స్టేషన్ కొనసాగుతుంది. దీనివల్ల రాత్రి వేళలో పెట్రోలింగ్ చేయడానికి సరైన సిబ్బంది లేకపోవడంతో ఇదే ఆసరాగా తీసుకొని దొంగలు ఇళ్లల్లో చొరబడి దోసకపోతున్నారు. ముఖ్యంగా తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు దొంగలు. ఇప్పటివరకు బాన్సువాడ, శ్రీనగర్, అన్నా సాగర్ లో దొంగతనాలకు పాల్పడ్డారు దొంగల్ని ఇప్పటివరకు పోలీసులు గుర్తించలేకపోయారు. సోమవారం రాత్రి బీర్కూర్లో నాలుగు ఇండ్లలో దొంగతనం జరిగింది. దొంగల కోసం గాలి ఇస్తున్నామంటూ పోలీసులు వెల్లడిస్తున్నారు తప్ప దొంగలు పట్టుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఇప్పటికే కార్లలో ఉన్న డబ్బులను దొంగలించకపోయిన దొంగలను ఇప్పటివరకు పోలీసులు పట్టించుకోలేదు. ఈ ఘటన జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా దొంగలను పట్టుకోవడంలో పోలీసులు పూర్తిగా వెనుకబడి ఉన్నారు. మళ్లీ దొంగతనాలు పెరిగిపోవడంతో ఇంటిని విడిచి బయటకు పోవడానికి ప్రజలు భయపడుతున్నారు. ఇంటికి తాళం



వేస్తే వచ్చేసరికి గుల్ల అవుతుందని బాధితులు కంటతడి పెడుతున్నారు. ఇప్పటికైనా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో దొంగతనాలను అరికట్టడానికి ప్రత్యేకంగా ఒక పోలీస్ విభాగం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వరుస ఘటనలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# బండి సంజయ్‌ను కేంద్ర సహాయక మంత్రి నుండి భర్త రఫీ చేయాలి

◆ **పొతంగల్ మండల్ ఎంఏ అకీమ్ డాక్టర్ ప్రెస్ మీట్**

పోతంగల్ /మే 12 /(జన సంఘర్షణ)

మైనర్ బాలికపై అత్యాచారం చేసి పోక్సో కేసు నిందితుడైన కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి బండి సంజయ్ ను కేంద్ర సహాయక మంత్రి నుండి భర్త రఫీ చేయాలి. బాధిత కుటుంబ సభ్యులకు భద్రత కల్పించాలి. బాధితురాలికి న్యాయం చేయాలి. బండి సంజయ్ కుమారుడి కేసుపై పోతంగల్ మండలం బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు మంగళవారం రోజున మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం ఏ హకీమ్ మాట్లాడుతూ చట్టం అనేది అందరికీ సమానమే అనే సూత్రం సమాధి అయ్యిందా అని ప్రశ్న నేడు తెలంగాణ ప్రజానీకంలో ఉత్పన్నమవుతుంది. పోక్సో కేసులో ఎఫ్ ఆర్ ఐ చేసి నాలుగు రోజులు గడిచిన అరెస్ట్ చేయలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ బిజెపి చీకటి ఒప్పందం ఏమైనా నడుస్తున్నదా? బాలికపై అత్యాచారం చేసి ఫోక్సో కేసు నమోదైన బండి భగీరథ తండ్రి బండి సంజయ్ కేంద్ర మంత్రి నుంచి భర్త రఫ్ చేయాలి. ఈ విషయంపై రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని వెంటనే బండి భగీరథ ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలు న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వెళ్తే గంటల పొడుగు పట్టింది. కేసు నమోదై 72గంటలు దాటి 4 రోజులు అవుతున్న నిందితుడిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు ఎందుకు వెనుకాడుతున్నారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. ఈ ప్రెస్ మీట్ లో



ఎం ఎ హకీమ్, సూదం నవీన్, ఆరిఫ్, ఏజస్, హైమద్, యూసుఫ్, సాగర్, హనుమండ్లు, ఫెరోజ్,ఇబ్రహీం, గంధపు గణేష్, ప్రవీణ్, సాజిత్, రాజు రేణి, పాషా, బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రైల్ రోకో కేసులో కల్వకుంట్ల కవితకు సమన్లు


◆ **రేపు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశం**

◆ **బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన కల్వకుంట్ల కవిత**

◆ **కవితతో పాటు మరో 12 మంది టీఆర్ఎస్ నాయకులపైనా కేసులు**

కామారెడ్డి/మే 12/(జన సంఘర్షణ)

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే చట్టం కింద కేసులు నమోదు చేశారు రైల్ రోకో కేసులో కోర్టుకు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు బుధవారం ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్ లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుకావాలని సమన్లలో పేర్కొన్నారు 2025 నవంబర్ 28న కామారెడ్డి జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో చేపట్టారు.. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించి పంపిన బీసీ బిల్లులకు వెంటనే ఆమోదం తెలుపాలని డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తామని తేల్చిచెప్పారు.. కల్వకుంట్ల కవితతో పాటు రైల్ రోకో చేస్తున్న టీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు కల్వకుంట్ల కవితతో పాటు టీఆర్ఎస్ నాయకులు చేపట్టిన రైల్ రోకో కారణంగా సిర్నపల్లి -- ఇందల్వాయి రైల్వే స్టేషన్ల మధ్య



నిజామాబాద్ నుంచి హైదరాబాద్ కు వెళ్తున్న దేవగిరి ఎక్స్ ప్రెస్ ను నిలిపివేశారు. అలాగే హైదరాబాద్ నుంచి నిజామాబాద్ రూట్ లో ప్రయాణిస్తున్న మరో గూడ్స్ రైలును నిలిపివేశారు. రైల్ రోకో చేపట్టిన కల్వకుంట్ల కవితతో పాటు మరో 12 మంది నాయకులపై కామారెడ్డి రైల్వే ఏఎస్ఐ రవీంద్ర బాబు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా కవితతో పాటు 12 మంది టీఆర్ఎస్ నాయకులపై ఖ/సావఎ. 147ఒ74(ఖ) రైల్వే ఆక్ట్ కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని సికింద్రాబాద్ రైల్వేస్ సెకండ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాసెస్ కోర్టు జారీ చేసిన సమన్లలో పేర్కొన్నారు.

# ఏసీబీ వలలో సర్పంచ్ భర్త, పంచాయతీ కార్యదర్శి

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి/మే12/(జన సంఘర్షణ)

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా సర్పంచ్ భర్త, పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ వలలో సర్పంచ్ భర్త, పంచాయతీ కార్యదర్శి 10 వేల లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిన నిందితుడు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా సర్పంచ్ భర్త, పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఒకరి ప్లాట్ నుంచి డ్రైనేజీ పైప్‌లైన్ వెళ్తోంది. దానిని తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు రూ. 25 వేల లంచం డిమాండ్ చేశాడు. రూ. 20 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్న బాధితుడు గతంలో రూ. 10 వేలు ఇచ్చాడు. మిగిలిన రూ. 10 వేలను సోమవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ గొల్లపల్లి పద్మ భర్త గొల్లపల్లి ఆంజనేయులుకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శి కూడా కార్యాలయంలోనే ఉన్నాడు. కార్యదర్శికి, సర్పంచ్ భర్తకు మధ్య ఉన్న ఒప్పందం మేరకే లంచం డబ్బులను సర్పంచ్ భర్త తీసుకున్నట్లు ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ సుదర్శన్ చెప్పారు.



## లబ్ధిదారులకు బండి రమేష్ చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 12 (జన సంఘర్షణ):



కూకట్పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ డివిజన్ కి చెందిన 1) జంగం ప్రశాంత్ బిక్షపతికి 60,000 రూపాయల చెక్కు, 2) మూసాపేట్ డివిజన్ కి చెందిన తల్లారి మమత ఎ/శీ సురేష్ కి 60,000/- చెక్కులు మంజూరు కావడం జరిగింది. ఈ నేపథ్యంలో చెక్కులు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్పల్లి టిపిసిసి ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిదికి ధరకాస్తు చేసుకోగ 1,20,000/- రూపాయలు మంజూరైనవి. చెక్కులను బండి రమేష్ చేతుల మీదుగా మంగళవారం రోజు కూకట్పల్లి నియోజకవర్గం శ్రీ హేమ దుర్గ భవన్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాలి బాలాజీ, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, విటల్ రెడ్డి, కనకయ్య, అస్లాం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా వెంకటరమణ జువెలరీస్ షాప్ ను ప్రారంభించిన బండి రమేష్

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 12 (జన సంఘర్షణ):



వ్యాపారం ఏదైనా వినియోగదారుడు నచ్చేలా మెచ్చేలా ఉండాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకటరమణ జువెలరీస్ షాప్‌ను ఆయన మంగళవారం రోజు ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అలాగే నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం యాదవ్, గాలి బాలాజీ, కొప్పిశెట్టి దినేష్, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, గంధం రాజు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ శోభాయాత్రను ప్రారంభించిన బండి రమేష్

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 12 (జన సంఘర్షణ):



హనుమాన్ జయంతి మంగళవారం రోజు ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా హనుమాన్ ఆలయాల్లో ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు అలంకరణలు భక్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని అల్లాపూర్ డివిజన్‌లో గల రాజీవ్ గాంధీ నగర్ లో ఉదయం పూజలు అనంతరం ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ హనుమాన్ శోభాయాత్రను టీపీసీసీ ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. యాత్రలో హిందూ యువకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని నృత్యాలతో అలరించారు. శోభాయాత్ర కనుల పండుగ జరిగింది. జై శ్రీరామ్, జై హనుమాన్ అన్న నినాదాలతో పురవీధులన్నీ మార్మోగాయి.ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ గౌడ్, రేష్మ, బర్కత్ ఆలీ ,నరసింహ ,మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీకి తాళం వేసి రైతుల నిరసన

◆ **అవసరం లేకున్నా నానో యూరియా అంట కడుతున్నారని రైతుల ఆరోపణ**

పోతంగల్/మే 12/(జన సంఘర్షణ)




నిజామాబాద్ జిల్లా పోతంగల్ విశాల సహకార సంఘం పరిధిలోని హెగ్డేలి గ్రామంలో రైతులు సొసైటీకి తాళం వేసి నిరసన తెలిపారు .పోతంగల్ విశాల సహకార సంఘం పరిధిలోని హెగ్డేలి గ్రామంలో రైతులు మంగళవారం సొసైటీకి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు పుప్పాల శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. తమకు అవసరం లేని నానో యూరియా లిక్విడ్? , అంటగట్టుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో తీసుకున్న లిక్విడ్ మిగిలిపోయి ఉందన్నారు. మూడు సంచుల ఎరువులు తీసుకుంటే ఒక లిక్విడ్? బాటిల్? తీసుకోవాలనే కండీషన్? పెట్టడంతో రైతులు , నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లిక్విడ్ తీసుకోవడం మూలంగా రైతులపై రూ.200 అదనపు భారం పడుతుందన్నారు. ఇప్పటికే మందుల రేట్లు పెరిగిపోయాయని పేర్కొన్నారు. 10 సంచులకు ఒకటి ఇస్తే తీసుకుంటామని తెలిపారు.

**స్పందించిన ఏవో**

రైతుల ఆరోపణలపై ఏవో నిశితను వివరణ కోరగా.. రైతులకు అనవసరంగా నానో యూరియా ఇవ్వొద్దని చెప్పామన్నారు. సొసైటీ వాళ్లను అడిగితే రైతులు లిక్విడ్ తీసుకోకుంటే స్టాక్ రిటర్న్ చేస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రుక్మయ్య, అర్జున్, సురేందర్, అశోక్, ప్రవీణ్, భారత్, చందు, గణేష్, రాము, ఆంజనేయులు, వినయ్, సురేందర్ పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూమ్ గృహాల సమస్యలపై సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్ :**
హిమాయత్నగర్లోని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు.ఈ సమావేశంలో డబుల్ బెడ్రూమ్ గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కాప్రా ప్రాంతంలోని డబుల్ బెడ్రూమ్ గృహాల్లో లిఫ్టులు పనిచేయడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గ్రామ పంచాయతీ భూముల్లో లేఅవుట్లు చేసి విక్రయాలు జరుపుతూ, అదే భూములకు రైతుబంధు సాయం కూడా పొందుతున్న అంశంపై విచారణ జరిపించాలని కోరారు.డబుల్ బెడ్రూమ్ గృహాల లబ్ధిదారుల ఎంపికలో స్థానికులకు ప్రాధాన్యత కల్పిస్తూ 50 శాతం కేటాయింపులు చేయాలని సూచించారు. గృహ సముదాయాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అదేవిధంగా, ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కోరగా, దీనిపై వెంటనే జిల్లా కలెక్టర్తో మాట్లాడాలని మంత్రి అధికారులకు సూచించినట్లు తెలిసింది.గృహ నిర్మాణాల పరిస్థితిని సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రజలకు త్వరితగతిన ఇళ్లను అందించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

**అన్నపురెడ్డిపల్లి :**



అన్నపురెడ్డి పల్లి చెరువు దగ్గర కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో అన్నపురెడ్డి పల్లి ఎస్సై విజయ సింహా రెడ్డి, తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.7,200 నగదు 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వారి పై కూడా కేసు నమోదు చేశామన్నారు. పేకాట నిర్వహణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ దాడిలో ఎస్సై తన సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శి నోటీసుపై పామురపాడు గ్రామస్తుల ధిక్కారం

**-వంద మంది సంతకాలతో ఎదురుదాడి..**

**-వివరణ ఇవ్వాలంటూ సెక్రటరీకి వినతి**



**మాడుగులపల్లి:**
నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి జారీ చేసిన నోటీసుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, వాస్తవాలను పరిశీలించకుండా నోటీసులు ఇవ్వడంపై మంగళవారం సుమారు 100 మంది గ్రామస్తులు ఏకమై కార్యదర్శికి వివరణాత్మక లేఖను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

**అసలేం జరిగింది?**

గ్రామంలోని ఒక కాలువ లేదా బాటకు సంబంధించి అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే, అది పూర్తిగా ప్రభుత్వ నిర్మితమని, గతంలోనే గ్రామ పెద్దలు, నాటి పంచాయతీ తీర్మానాల ద్వారా ఆ ప్రాంతాన్ని బహిరంగ అవసరాల కోసం కేటాయించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీనికి సంబంధించి పూర్తి ఆధారాలు పంచాయతీ రికార్డుల్లోనే ఉన్నాయని, తమ పూర్వీకులకు దాంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నారు.కార్యదర్శి తీరుపై విమర్శలు సొంత గ్రామ రికార్డులను పరిశీలించకుండా, స్థానిక పరిస్థితులపై అవగాహన లేకుండా నోటీసులు పంపడం వెనుక అంతర్యమేమిటని బాధితులు ప్రశ్నించారు. ఈ మేరకు వంద మంది గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేసి, ఇది ప్రభుత్వ స్థలమేనని సాక్ష్యం చెబుతున్నారు అధికారుల నోటీసులకు భయపడేది లేదని, అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు,

**గ్రామస్తుల డిమాండ్**

మా వద్ద ఉన్న సాక్ష్యాధారాలు, గ్రామ పెద్దల స్టేట్మెంట్లను పరిగణనలోకి తీసుకోవాలి. పంచాయతీ రికార్డులను పక్కాగా తనిఖీ చేసి, అనవసరంగా జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలి అని గ్రామస్తులు డిమాండ్ చేశారు. వంద మంది గొంతుకలతో కూడిన ఈ వినతిపత్రం ఇప్పుడు మాడుగులపల్లి మండలంలో చర్చనీయాంశంగా మారింది.

# కట్ట మైసమ్మ దేవాలయంలో ఎమ్మెల్సీకోదండరాం ప్రత్యేక పూజలు

**-ప్లీనరీ కి భారీ ర్యాలీతో తరలి వెళ్ళిన జన సమితి నేతలు**

**-పలువురిని ఆకట్టుకున్న కళాబృందాలు**









**హైదరాబాద్, :**
తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం లోయర్ ట్యాంక్ బండ్లోని కట్టమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జలవిహార్లు జరుగుతున్న తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్లీనరీ సమావేశాలకు పూజలు అనంతరం భారీ ర్యాలీతో తరలి వెళ్లారు. ర్యాలీలో అగ్రభాగాల కోలాటం కళాకారులు, డబ్బు నృత్యాలు, బతుకమ్మలు, బోనాలు ఉండగా ఓపెన్ టాప్ జీపోలో కోదండరాం అభివాదం చేస్తూ ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లీనరి లో పలు రాజకీయ తీర్మానాలు చేసి భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ధారిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, కార్మిక విభాగం కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, జన సమితి నాయకులు రామ్ చందర్, జస్వంత్ జైపాల్ రెడ్డి ,రవీందర్ యాదవ్, సుధాకర్,రసూల్, వెంకటయ్య అజయ్ గౌడ్, కార్మిక నాయకులు జహీర్, బాలరాజు, కృష్ణ, బలవంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐజీ కాలనీ సమస్యల పరిష్కారానికి మంత్రి,అధికారులకు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్ :**
చెర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీ వాసులు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్యలు ప్రారంభించారు. ఐజీ కాలనీ, చెర్లపల్లి ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాటర్ వర్క్స్ నిర్వహణ సంచాలకుడు అశోక్ రెడ్డి, మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2009లో జేఎన్యూఆర్ఎం పథకం కింద సుమారు 1200 ఇళ్లను నిర్మించగా, అప్పట్లో ఏర్పాటు చేసిన మురుగునీటి వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. దీంతో మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అలాగే, 2009లో నిర్మించిన ఇళ్లలో అనేక గృహాల పైకప్పులు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదం నెలకొన్నదని, మరమ్మతుల కోసం కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఐజీ కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, మురుగునీటి వ్యవస్థ పునరుద్ధరణతో పాటు ఇళ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేసి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నెమూరి మహేష్ గౌడ్,కాలనీ అధ్యక్షుడు పర్శురాము యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సాగర్ గౌడ్, వెంకటేష్, ప్రహ్లాద్ రెడ్డి, రవి యాదవ్, వెంకటేశ్వర్ రావు,లోక్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి







**ఉప్పల్ :**
హనుమాన్ జయంతి సందర్భంగా హబ్సిగూడ ఎన్జీఆర్ఐ పరిధిలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ ప్రత్యేక పూజల్లో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొని ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, నియోజకవర్గం అభివృద్ధి చెందాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి వెంకన్న, బజారు పాండు గౌడ్, దేవాలయ కమిటీ సభ్యులు బికుమల్లా అంజయ్య గుప్తా, ఈగ అంజనేయులు, తుమ్మల దేవిరెడ్డి, బుసం రఘునాథ్ రెడ్డి, వర్కాల మదన్ గౌడ్, కడప నర్సింగ్, కిషన్ నాయక్, సంతోష్ కుమా ర్,కాంగ్రెస్ నాయకులు కంది శ్రవణ్ రెడ్డి,రాజన్న, మాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పాములపాడు పశు వైద్యశాలకు గ్రహణం నామమాత్రంగానే సేవలు

**-సిబ్బంది రాక కోసం రైతుల నిరీక్షణ మూగజీవాల ప్రాణాలతో చెలగాటం**



**మాడుగులపల్లి:**
ప్రభుత్వం పశుసంపదను రక్షించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఆ లక్ష్యం నీరుగారుతోంది నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామ పశు వైద్యశాల సిబ్బంది పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి ఆసుపత్రికి సిబ్బంది రాకపోవడం, వచ్చినా గంట సేపు కూడా అందుబాటులో ఉండకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,పాములపాడు గ్రామం మండల కేంద్రానికి కొంత దూరంగా ఉండటాన్ని సిబ్బంది తమకు అనుకూలంగా మార్చుకున్నట్లు తెలుస్తోంది పర్యవేక్షణ చేసే అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు,ఉదయం ఆలస్యంగా రావడం, వచ్చిన కొద్దిసేపటికే ఫీల్డ్ విజిట్ పేరుతో ఆసుపత్రికి తాళం వేసి వెళ్లిపోవడం ఇక్కడ నిత్యకృత్యమైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు,ప్రస్తుత వేసవి కాలంలో పశువులకు గొంతువాపు, గాలికుంటు వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంది ఇలాంటి కీలక సమయంలో వైద్యశాల అందుబాటులో లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు పశువులకు అత్యవసర చికిత్స అవసరమైనప్పుడు సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించడం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ డాక్టర్లను ఆశ్రయించాల్సి వస్తోందని

# మిషన్ భగీరథ పథకం అమలులో ప్రభుత్వం విఫలం

-ప్రజల తాగునీటి అవసరాల కోసం నిధుల మంజూరులో సర్కార్ నిర్లక్ష్యం
-నీటిపథకాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి
-నిధుల కొరత సాకుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు
-తాగునీటి సమస్యను అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించాలి
-సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి లేకపోతే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం
-ప్రజా దాహార్తిని తీర్చేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి
-నీటి సరఫరా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
-కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెం**
ప్రజా దాహార్తిని తీర్చేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఓవర్ హెడ్ ట్యాంకులు, రిజర్వాయర్లు, పైపులైన్ల నిర్మాణం, బోర్ల తవ్వకం పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పనుల్లో జరుగుతున్న నిర్లక్ష్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల తాగునీటి అవసరాల కోసం నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ తీరు ఏమాత్రం ఆశాజనకంగా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమని చెప్పుకుంటున్న మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో విఫలమైందని, పనుల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. నిధుల మంజూరు విషయంలో ప్రభుత్వం చూపుతున్న వివక్షను ఆయన నిలదీశారు. నీటి సమస్య పరిష్కారం కోసం తాను అందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పక్కన పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి దృష్ట్యా ప్రజలు అల్లాడకుండా నిరంతరం నీటి సరఫరా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. నిధుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, అయితే ఉన్న వనరులతో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అధికారులు తిరుమలేశ్, శివయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు.. ఇద్దరు కాంగ్రెస్ నేతలపై సస్పెన్షన్



**వేలేరు / ప్రజావారధి:**
పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఇద్దరు కాంగ్రెస్ నాయకులపై పార్టీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వేసింది. పిచర గ్రామానికి చెందిన జల్తారి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు మంతపురి రాజును పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సంపత్ తెలిపారు.పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడం, పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరించడమే ఈ నిర్ణయానికి కారణమని ఆయన వెల్లడించారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారిపై భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని నాయకత్వం హెచ్చరించింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మెరుగు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

-దేవాలయ అభివృద్ధికి రూ.1 లక్ష విరాళం అందించిన విశాఖ ఇండస్ట్రీస్




**మాడుగులపల్లి :**
మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.విశాఖ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో అకౌంటెంట్ బద్రి నారాయణ, మానవ వనరుల విభాగం సిబ్బంది నాగార్జున, రవి, రమేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కోసం సంస్థ తరఫున రూ.1 లక్షల చెక్కును గ్రామ సర్పంచ్ వూర ప్రసన్న రాబర్ట్కు అందజేశారు.ఈ కార్యక్రమంలో రామచంద్ర రెడ్డి, నరేష్, రేపాల హరిప్రసాద్తో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాల పంపిణీ నిర్వహించారు.దేవాలయ అభివృద్ధికి సహకారం అందించిన విశాఖ ఇండస్ట్రీస్ యాజమాన్యానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మందముల పరమేశ్వర్ రెడ్డి







**ఉప్పల్ :**
హనుమాన్ జయంతి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. హెచ్బీ కాలనీ మంగాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం, రామంతపూర్ శ్రీనగర్ కాలనీలోని శ్రీ భక్తాంజనేయ దేవాలయం, ఉప్పల్ మండే మార్కెట్లోని శ్రీ అభయ ఆంజనేయ దేవాలయం, ఉప్పల్ బురుజులోని ప్రసన్న ఆంజనేయ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉప్పల్ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మందముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ హనుమంతుడు భక్తి, బలం, ధైర్యం, సేవాభావానికి ప్రతీక అని అన్నారు. శ్రీరాముడిపై అపార భక్తి కలిగిన హనుమంతుడి జీవితం నిజాయితీ, వినయం, గురుభక్తి, ధైర్యం వంటి గొప్ప గుణాలను నేర్పుతుందని పేర్కొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్బీ కాలనీ విభాగ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య, ఆలయ ధర్మకర్తలు జ్యోతి, అనిల్ గుప్తా, ఉదయ్ కిరణ్, నల్గొండ సమ్మయ్య, నవీన్ గౌడ్, ఎల్లవ్వ, శ్రీనివాస్ ముదిరాజ్, శ్రావణ్ గౌడ్, వెంకటేష్, మల్లికార్జున్, సురేష్ గౌడ్, రాజేష్, సూరి, శ్రీకాంత్, జానీ, హర్ష రెడ్డి, ఆకాష్, గణేష్తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా రామంతపూర్ విభాగ ఆలయ కమిటీ సభ్యులు రాజమౌళి, పెంటయ్య, యాదగిరిరెడ్డి, ఉదయ్ దేశాయ్, జంగారెడ్డి, రాజమల్లు, చౌదరి, విభాగ అధ్యక్షుడు రఫిక్, ఉపేందర్ రెడ్డి, జలీల్ పాషా, శ్రీకాంత్ యాదవ్, అరుణ్ పటేల్, గరిక సుధార్, రాజిరెడ్డి, శ్రీధర్, భాస్కర్, గంగాపుత్ర, సత్తిరెడ్డి, సత్తన్న, సతీష్ గౌడ్, ముత్యాల జంగయ్య, ముత్యాల బాబు, అశోక్, రవి, సలీం, నాగమల్లయ్య, కిషోర్, స్వామి, శంకర్, విశాల్, గౌతమ్, కిరణ్, హరీష్ రెడ్డి, అంబిక, శ్రీనివాస్ గౌడ్తో పాటు ఉప్పల్ విభాగానికి చెందిన బజార్ నవీన్,

## తోడు దొంగలు" రెస్టారెంట్ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**మల్లాపూర్ :**
మల్లాపూర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన "తోడు దొంగలు" రెస్టారెంట్ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్ను ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త వ్యాపారాలతో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. వ్యాపార రంగంలో నిర్వాహకులు మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడానికి ఇటువంటి వ్యాపార సంస్థలు దోహదపడతాయని పేర్కొన్నారు.వినియోగదారులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సేవలు అందించాలని రెస్టారెంట్ నిర్వాహకులకు సూచించారు. వ్యాపారంలో మంచి పేరు తెచ్చుకొని విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, కొండాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, హోటల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co